

సాక్షి పల్నాడు

గురువారం । 9 । ఫిబ్రవరి । 2023



సాగునీటి సమాచారం


తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద 2,423 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1343 క్యూసెక్కులు విడుదలయ్యాయి.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 41.0997 టీఎంసీలు. ఎగువ నుంచి 8,533 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 4,200 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా బుధవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

నేడు మంత్రి రోజా బాపట్ల రాక

బాపట్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా గురువారం బాపట్ల రానున్నారు. ఉదయం 9 గంటలకు రోడ్డు మార్గంలో విజయవాడ నుంచి బయలుదేరి 10.30 గంటలకు సూర్యలంక సముద్ర తీరానికి చేరుకుంటారు. సూర్యలంక సముద్రతీరాన్ని పరిశీలించి మధ్యాహ్నం 2 గంటలకు తిరిగి బయలుదేరి విజయవాడకు చేరుకుంటారు. పర్యాటక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలి సారిగా జిల్లాకు వస్తుండటంతో అధికారులు ఏర్పాట్ల పనుల్లో నిమగ్నమయ్యారు.


ఆరుగురు ట్రెజరీ ఉద్యోగులకు చార్జ్ మెమోలు

గుంటూరు వెస్ట్: ఆరుగురు జిల్లా ట్రెజరీ శాఖ ఉద్యోగులకు రాష్ట్ర శాఖ చార్జ్ మెమోలు జారీ చేసింది. 2014–15 అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో 74 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జిల్లా ట్రెజరీ కార్యాలయం అదనపు చెల్లింపులు చేసింది. దీంతో అప్పట్లో కొంత గందరగోళమేర్పడింది. కొందరు ఉన్నతాధికారులు ఈ విషయమై వాస్తవాలను గుర్తించి అప్పట్లోనే చర్యలు చేపట్టినా అవి పూర్తిస్థాయిలో అమలు కాలేదు. దీనిపై మళ్లీ జిల్లా ట్రెజరీ అధికారులు దృష్టి సారించారు.

11న జాతీయ లోక్‌అదాలత్

నరసరావుపేటటౌన్: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీ నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఓ.వెంకట నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. అదాలత్‌లో రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులతో పాటు సివిల్ కేసులు, ముందస్తు వ్యాజ్యాలు పరిష్కరించబడతాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకుని విలువైన సమయాన్ని వృథా కాకుండా కాపాడుకోవాలన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 561.90 అడుగుల వద్ద ఉంది. ఇది 236.6166 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 10,120, ఎడమ కాలువకు 8,629, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 20,224, ఎస్‌ఎల్‌బీసీకి 2,400, వరద కాలువకు 320 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 41,693 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 20,795 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 836.00 అడుగుల వద్ద ఉంది. ఇది 57.0878 టీఎంసీలకు సమానం.

యార్డులో 1,15,904 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 1,10,553 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,15,904 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.21,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ.25,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 76,868 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,000, గరిష్ట ధర రూ.4,300, మోడల్ ధర రూ.3,600 వరకు పలికింది.

పేదోడికి ఆరోగ్యశ్రీ అండ



కలెక్టర్ శివశంకర్‌తో చిన్నారి పల్లవి, తల్లి గంగమ్మ

ఈ ఫొటోలో కనిపిస్తున్న చిన్నారి పేరు పల్లవి (5). మల ద్వారం మూతపడి, మరో మార్గం ద్వారా విసర్జిస్తోంది. ఈ అనారోగ్యం వల్ల చాలా ఇబ్బందిపడుతోంది. పల్లవి తల్లి గంగమ్మ సత్తెనపల్లిలో కూలి పనుల చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. మూడు నెలల క్రితం స్పందన కార్యక్రమంలో కలెక్టర్ శివశంకర్ వద్దకు వెళ్లి సహాయం కోరగా ఆయన వెంటనే స్పందించారు. రూ.5 వేల తక్షణ ఆర్థిక సహాయం చేయడంతో పాటు, ఆరోగ్యశ్రీ సిబ్బందికి చెప్పి ఉచితంగా వైద్యం అందించాలని ఆదేశించారు. నరసరావుపేటలోని ఓ మల్టీ స్పెషాల్టీ ఆసుపత్రిలో క్లిష్టమైన ఆపరేషన్ మొదటి దశను పూర్తి చేశారు. ఆరోగ్యశ్రీతో జగనన్న మమ్మల్ని దేవుడులా ఆదుకున్నాడని గంగమ్మ కృతజ్ఞతలు తెలుపుతోంది. ఇలా ఎంతో మందికి ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా రూ.లక్షల విలువ చేసే వైద్యం ఉచితంగా అందిస్తోంది.

- ఆపన్నులకు అండగా నిలుస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం
- పల్నాడు జిల్లా పరిధిలో 104 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్య సేవలు
- అన్ని రకాల మల్టీస్పెషాలిటీ సేవలు అందుబాటులోకి
- జిల్లాలో 6,36,500 హెల్త్ కార్డులు జారీ
- 2019 నుంచి జిల్లాలో 1,69,334 మందికి లబ్ధి
- శస్త్రచికిత్సల కోసం రూ.417.55 కోట్లు ఖర్చుచేసిన ప్రభుత్వం
- ఆరోగ్య ఆసరా కింద 77,639 మందికి రూ.44.08 కోట్ల లబ్ధి



ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అందుతున్న చికిత్స తీరును పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా ఆరోగ్యశ్రీ కో- ఆర్డినేటర్ డాక్టర్ సునీల

సాక్షి, నరసరావుపేట: ప్రజలందరికీ అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చి, నిరుపేదలు సైతం ధైర్యంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా చికిత్స పొందాలన్న ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించారు. దేశంలో మరే రాష్ట్రంలో అమలుకాని పథకాన్ని విజయవంతంగా అమలు చేయడంతో ప్రజల మన్ననలు పొందారు. అయితే తర్వాత కాలంలో అధికారం చేపట్టిన ముఖ్యమంత్రులు ఈ పథకాన్ని నీరుగార్చారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పేదలకు మెరుగైన వైద్యం అందలేదు. తిరుగులేని ప్రజామద్దతుతో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకానికి పునరుజ్జీవం పోయడంతో లక్షలాది మందికి మెరుగైన వైద్య సేవలు నిర్విరామంగా అందుతున్నాయి. ఆరోగ్యశ్రీ పరిధిని పెంచడంతో పాటు వైఎస్సార్ ఆరోగ్య ఆసరాను అమలు చేశారు. పల్నాడు జిల్లా పరిధిలో 104 నెట్‌వర్క్ ఆసుపత్రుల పరిధిలో 3,255 రకాల చికిత్సలను ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేదవారు రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం పొందారు. వైద్యం కోసం పేదలు అప్పుల పాలుకాకుండా ప్రభుత్వం ఆదుకుంటోంది. 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి జిల్లాలో 1,69,334 మందికి ఆరోగ్యశ్రీ ద్వారా రూ.417.55 కోట్ల విలువ చేసే వైద్యం అందించారు.

ఆసరా ద్వారా రూ.44.08 కోట్లు..

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం స్ఫూర్తితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ప్రవేశపెట్టిన పథకమే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య ఆసరా. శస్త్రచికిత్సల అనంతరం రోగి కోలుకునే వరకూ ఆసరాగా ప్రభుత్వం ఉండాలనే ఆలోచనతో ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారు. రోగి చికిత్స అనుసరించి అతడి విశ్రాంతి కాలంలో రోజుకు రూ.225 చొప్పున గరిష్టంగా నెలకు రూ.5,000 ఇస్తున్నారు. శస్త్రచికిత్సల అనంతరం రోగులు డిశ్చార్జ్ కాగానే వారికి వైఎస్సార్ ఆరోగ్య ఆసరా నగదు జమ చేస్తున్నారు. డాక్టర్ వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 2019 నుంచి జిల్లా పరిధిలో 77,639 మందికి రూ.44.08 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందజేసింది.

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పల్నాడు జిల్లాలో ఆరోగ్యశ్రీ అమలు వివరాలు

సంవత్సరం	చికిత్స పొందిన వారి సంఖ్య	ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.కోట్లలో
2019-20	33,459	84.78
2020-21	37,551	95.06
2021-22	56,005	125.70
2022-23 (31-01-23 వరకు)	42,319	111.91
మొత్తం	1,69,334	417.55

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో ఆరోగ్య ఆసరా నగదు సహాయం

సంవత్సరం	చికిత్స పొందిన వారి సంఖ్య	ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.కోట్లలో
2019-20	5,999	3.89
2020-21	17,285	10.71
2021-22	28,871	14.99
2022-23 (31-01-23 వరకు)	25,484	14.86
మొత్తం	77,639	44.08

పేదలకు వరం ఆరోగ్యశ్రీ



డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పేదలకు వరం లాంటిది. ఖరీదైన వ్యాధులకు సైతం ఉచితంగా చికిత్స అందుతోంది. గతంలో గుంటూరు, విజయవాడ వంటి నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం పల్నాడులో అన్ని రకాల మల్టీ స్పెషాల్టీ వైద్య సేవలు ఆరోగ్యశ్రీలో అందుబాటులో ఉన్నాయి. పేదలకు ఉచితంగా వైద్యం అందించడంతో పాటు విశ్రాంతి సమయంలో భృతిని సైతం అందజేస్తున్నాం. ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులపై నిఘా ఉంచి పేదలకు మెరుగైన వైద్యం పూర్తి ఉచితంగా అందేలా చూస్తున్నాం. ఏదైనా సమస్య ఉంటే 104/9281073617 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేస్తే తక్షణం చర్యలు తీసుకుంటాం.

– శివశంకర్ లోతేటి, కలెక్టర్, పల్నాడు జిల్లా

పైసా ఖర్చు లేకుండా ఆపరేషన్



నోటి క్యాన్సర్‌తో బాధపడుతున్న నాకు ప్రభుత్వం రూ.1.5 లక్షల విలువైన సర్జరీని ఆరోగ్యశ్రీ ద్వారా హైదరబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో ఉచితంగా చేయించింది. పేదరికంలో ఉన్న మాకు కుటుంబం గడవడానికి ఆరోగ్య ఆసరా పేరిట ఇంటికి వెళ్లే సమయంలో రూ.3,375 బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. జగనన్న మా ఇంటి దేవుడు. ఆయన రుణం ఎప్పటికీ తీర్చుకోలేం.

– నరసింహారావు, ముటుకూరు, దుర్గి మండలం

అధికారులు వసతి గృహాల్లో రాత్రి బస చేయండి

జిల్లా కలెక్టర్ శివశంకర్



నరసరావుపేట: మండల ప్రత్యేక అధికారులు శుక్రవారం నుంచి ఆయా మండలాల్లోని పంచాయతీల్లో ఉన్న రెసిడెన్షియల్ వసతి గృహాల్లో రాత్రి బస చేసి విద్యార్థులతో సహపంక్తి భోజనం చేయాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి మండల రెవెన్యూ అధికారులు, విద్యాధికారులు, ఎంపీడీవోలు, సచివాలయ అసిస్టెంట్ ఇంజినీర్లతో ఆయా గ్రామాల్లో ట్రాన్సిట్ నడక నిర్వహించి సమస్యలను గుర్తించాలన్నారు. పారిశుద్ధ్యం, డ్రాపౌట్స్‌పై దృష్టి సారించాలని చెప్పారు. నడక చివరలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల వద్ద క్లాప్ మిత్రలతో ముఖాముఖి నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో మిషన్ శుభకృతి కార్యక్రమంలో భాగంగా చెక్క, ప్లాస్టిక్, పేపర్, ఐరన్ వ్యర్థాలను పోగుచేసి ఒకచోట దహనం చేయాలన్నారు. జిల్లా ఆఫీస్ మాన్యువల్‌లోని నిబంధనలను అనుసరించి ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న సామగ్రిని ఈ నెల 16 నుంచి 23వ తేదీలోపు గుర్తించాలని, 28వ తేదీ నాటికి రవాణాకు సంబంధించి చర్యలు చేపట్టాలని, మార్చి మూడో తేదీన వాటికి అనువైన ప్రదేశానికి తరలించాలని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సామగ్రి, పాత వాహనాలను రవాణా శాఖ అనుమతితో నాలుగో తేదీ వేలం వేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మార్చి 16 నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. పాత భవనాలను గుర్తించి వాటి స్థితిగతులనుబట్టి కూల్చి వేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీలను త్వరితగతిన అప్లోడ్ చేయాలని చెప్పారు. సస్టైనబుల్ గోల్స్‌లో అవసరమైన పారామీటర్స్‌ను సంబంధిత వెల్ఫేర్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకోవాలన్నారు. గృహ నిర్మాణ శాఖకు సంబంధించి రూఫ్ లెవల్ వరకు పూర్తయిన గృహాలను ఉగాది నాటికి లబ్ధిదారులకు అందించేలా పనులు పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం పాల్గొన్నారు.

డిసెంబర్ చివరి నాటికి రీ–సర్వే పూర్తే లక్ష్యం

- పల్నాడు జిల్లా జేసీ ఎ.శ్యాంప్రసాద్
- యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయం, గ్రామ సచివాలయం సందర్శన



యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే వివరాలు తెలుసుకుంటున్న జేసీ ఎ.శ్యాంప్రసాద్

యడ్లపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష కార్యక్రమం పనులు వేగవంతం చేయాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం యడ్లపాడు మండలానికి విచ్చేసిన జేసీ తహసీల్దార్ కార్యాలయం, గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ముందుగా మండల పరిధిలో కొనసాగుతున్న రీ–సర్వే పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. గ్రామాల వారీగా నిర్వహిస్తున్న రీసర్వే ప్రగతి వివరాలను అధికారులు జేసీకి వివరించారు. అన్ని లేవుట్లలో ఉన్న జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని జేసీ ఆదేశించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న రీసర్వే ప్రక్రియపై విలేకర్లతో మాట్లాడారు. జిల్లా పరిధిలో ఫేజ్–1 కింద ఎంపిక చేసిన 70 రెవెన్యూ గ్రామాల్లో పూర్తిస్థాయి రీసర్వేకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. ఆయా గ్రామాల్లో 39 వేల మంది రైతులకు హక్కు పత్రాలను ఇవ్వాల్సి ఉండగా వాటిలో 20 వేల వరకు ఇప్పటికే పంపిణీ చేసినట్లు వివరించారు. నరసరావుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలో సర్వేకు ఎక్కడికక్కడే బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 390 మంది విలేజ్ సర్వేయర్లు, 450 మంది వీఆర్వోలు, 62 రోవర్లతో రీసర్వే పనులను చురుగ్గా చేస్తున్నట్లు వెల్లడించారు. సర్వే ఆఫ్ ఇండియా ద్వారా డ్రోన్ ఫ్లయింగ్ సర్వేకు 154 రెవెన్యూ గ్రామాలను నిర్దేశించుకోగా వాటిలో 106 గ్రామాల్లో జరుగుతోందన్నారు. ఇక గ్రౌండ్ ట్రూతింగ్ పనులు మొత్తం 3.60 లక్షల ఎకరాల విస్తీర్ణంలో చేయాల్సి ఉండగా ఇప్పటికే 3.30 లక్షల ఎకరాల్లో పూర్తి చేసినట్లు తెలిపారు. మేజర్‌గా రీసర్వే ప్రక్రియ నరసరావుపేట డివిజన్‌లోనే ప్రస్తుతం కొనసాగుతోందని, గురజాల డివిజన్‌లో ఆరు గ్రామాలు, సత్తెనపల్లి డివిజన్‌లోని మూడు గ్రామాల్లో పూర్తిస్థాయి రీసర్వే ముగిసిందన్నారు. రీసర్వేకు సంబంధించి సిబ్బంది కొరత ఎక్కడా లేదన్నారు. సర్వేలో వేగం పెంచాలంటూ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారనే విషయం వాస్తవం కాదన్నారు. ఒక్కొక్క ఓఆర్‌ఐ వచ్చిన తర్వాత ఆర్నెల్ల పాటు సమయం పడుతుందన్నారు. ఇంకా నెమ్మదిగా సర్వే పనులు నిర్వహిస్తే మరో ఐదారేళ్లకు కూడా పూర్తి చేసే పరిస్థితి ఉండదన్నారు. సర్వేకు సంబంధించి స్థానిక భూయజమానుల నుంచి అభ్యంతరాలు ఏవైనా వస్తే సత్వరమే రెవెన్యూ, సర్వే సిబ్బంది స్పందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లి వారి భూములకు సంబంధించిన హద్దులను కొలతలను చూపించడం జరుగుతుందని పేర్కొన్నారు. వారు సంతృప్తి చెందిన తర్వాతే సర్వే పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ భూముల విషయానికి వస్తే ఆక్రమణలో ఎన్ని ఉన్నాయి? వాటిలో సాగులో ఎన్ని, ఖాళీగా ఎన్ని ఉన్నాయన్న వివరాలను సేకరిస్తున్నామన్నారు. మొత్తం మీద ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి రీసర్వే పనులన్నీ సమగ్రంగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. నరసరావుపేట సర్వే డీఐ పార్థసారథి, తహసీల్దార్ ఎస్.నాగమల్లేశ్వరరావు, మండల సర్వేయరు రాంబాబు, పంచాయతీ కార్యదర్శి శశికళ పాల్గొన్నారు.

వైభవంగా గంధ మహోత్సవం

గుంటూరులో ప్రారంభమైన మస్తానయ్య ఉరుసు మహోత్సవాలు



దర్గాను సందర్శించిన జాయింట్ కలెక్టర్ రాజకుమారి

పాత గుంటూరు: గుంటూరు జీటీ రోడ్డులోని హజరత్ కాలే మస్తాన్‌షా అవులియా దర్గా 131వ ఉరుసు మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువజామునే బాబా సమాధిపై చాందిని అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌రావు, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి బాబా సమాధిని దర్శించుకున్నారు. బాబా దివ్య సమాధికి చాదర్ సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు, గుంటూరు ఆర్డీవో ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. రాత్రి బాబా గంధ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. గంధాన్ని దర్గా ధర్మకర్త రావి రామ్మోహనరావు శిరస్సుపై ఉంచుకుని గంధ మహోత్సవాన్ని ప్రారంభించారు. మేళతాళాలు, తప్పెట్లు, బుట్టబొమ్మలు, కోలాట, భజన బృందాలు, బాణసంచా ధ్వనుల మధ్య ప్రత్యేకంగా అలంకరించిన బాబావారి గుర్రంపై గంధ మహోత్సవం వైభవంగా జరిగింది. కన్నావారితోట నుంచి నగరంలోని ప్రధాన వీధుల మీదుగా సాగి సంగడిగుంట చేరింది. బాబా విశ్రమించిన మంచానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డూండీశ్వరి, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్‌ను సమర్థంగా నిర్వహించాలి

- ప్రయోగశాలల్లో సీసీ కెమెరాలను కచ్చితంగా ఏర్పాటు చేయాలి
- ఇంటర్మీడియెట్ విద్య ఆర్జేడీ వీవీ సుబ్బారావు
- ఇంటర్ ప్రాక్టికల్స్ నిర్వహణపై ఉమ్మడి జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో గుంటూరులో సమావేశం



మాట్లాడుతున్న ఇంటర్మీడియెట్ విద్య ఆర్జేడీ వీవీ సుబ్బారావు


గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియెట్ విద్య ఆర్జేడీ వీవీ సుబ్బారావు అన్నారు. ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ద్వితీయ సంవత్సర సైన్స్, ఒకేషనల్ విద్యార్థులకు ఈ నెల 26 నుంచి జరగనున్న ప్రయోగ పరీక్షల (ప్రాక్టికల్స్)పై ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు బుధవారం గుంటూరులోని ఏసీ కళాశాల ఆడిటోరియంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐవో గర్నెపూడి సునీత అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్జేడీ సుబ్బారావు మాట్లాడుతూ ప్రాక్టికల్స్‌ను ప్రభుత్వ నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేసిన కళాశాలల్లో పరీక్షల నిర్వహణ ఇంటర్మీడియెట్ బోర్డు నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా జరుగుతాయని, ఈ విషయంలో కళాశాలల యాజమాన్యాల జోక్యాన్ని పరిగణనలోకి తీసుకోబోమని చెప్పారు. ల్యాబ్‌లలో సీసీ కెమెరాలను విధిగా ఏర్పాటు చేయాలని, లైవ్ స్ట్రీమింగ్ ద్వారా విద్యార్థులు, సిబ్బంది కదలికలను పరిశీలిస్తారని తెలిపారు.

పరీక్షా కేంద్రాల్లో కఠిన నిబంధనలు

ఆర్ఐవో జి.సునీత మాట్లాడుతూ ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్, థియరీ పరీక్షా కేంద్రాల్లో కఠిన నిబంధనలు అమలుపరుస్తున్నట్లు చెప్పారు. పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులందరూ ఈ నెల 15న జరగనున్న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, 17న జరగనున్న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలకు కచ్చితంగా హాజరు కావాలని సూచించారు. సంబంధిత రెండు పరీక్షలను ఏ కళాశాలలో విద్యార్థులకు అక్కడే నిర్వహించి, జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ఇతర కళాశాలల అధ్యాపకులతో చేయించాల్సిఉందని చెప్పారు. డీఈసీ సభ్యుడు జెడ్ ఎస్ రామచంద్రరావు మాట్లాడారు. ఈ సందర్భంగా బాపట్ల డీవీఈవో ఆంజనేయులు, సీనియర్ ప్రిన్సిపాల్స్ జుబేర్, టి.శేఖర్‌బాబు, పి.యర్రయ్య నిబంధనలు గురించి వివరించారు.

గుణదల తిరునాళ్లకు సర్వం సిద్ధం





మేరీమాత ఉత్సవాలకు గుణదల పుణ్యక్షేత్రం ముస్తాబైంది. మూడు రోజుల పాటు జరిగే ఈ తిరునాళ్లను తొలిరోజు విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు సమష్టి దివ్య పూజతో ప్రారంభిస్తారు. ఉత్సవాలకు లక్షలాదిగా యాత్రికులు తరలిరానున్న నేపథ్యంలో వీఎంసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కమిషనరేట్ పరిధిలోని 1500 పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

కుష్ఠు రోగులను జనజీవన స్రవంతిలోకి తీసుకురావాలి


అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

అధికారులతో ప్రతిజ్ఞ చేయించి కరపత్రాన్ని ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

నరసరావుపేట: కుష్ఠువ్యాధి రోగుల పట్ల వివక్షతను చూపించకుండా వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకొచ్చేందుకు జిల్లాలో ఉన్న అన్నీ వనరులను ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులకు సూచించారు. స్పర్శ లెప్రసీ అవేర్నెస్ క్యాంపెయిన్ జిల్లా కో-ఆర్డినేషన్ కమిటీ మీటింగ్ బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గాంధీ వర్ధంతి పురస్కరించుకొని ప్రతి ఏడాదీ ఈ క్యాంపెయిన్ జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వరకు అన్ని పంచాయతీ స్థాయిలలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కుష్ఠు వ్యాధిని సులభంగా గుర్తించవచ్చని, ఈ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించినట్లయితే పూర్తిగా నయం చేయొచ్చన్నారు. స్పర్శ లేని తెల్ల మచ్చలు, రాగి రంగు మచ్చలు, చేతులు కాళ్లు ఏమైనా అంగవైకల్యం, కండరాలు బలహీనంగా ఉన్న, కనురెప్పలు పూర్తిగా మోయలేకున్న లాంటి లక్షణాలు ఎవరికైనా ఉంటే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్‌ను సంప్రదించాలని కోరారు. కుష్ఠువ్యాధితో పోరాడుదాం పోరాడుదాం-కుష్ఠు వ్యాధిని గత చరిత్రగా మార్చేద్దాం మనే నినాదాన్ని విస్తృతంగా వ్యాపించచేయాలన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ జి.శోభారాణి, జిల్లా లెప్రసీ, టీబీ, ఎయిడ్స్ నియంత్రణాధికారి డాక్టర్ కె.పద్మావతి, డీఆర్వో వినాయకం, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి ఓబులునాయుడు, జిల్లా హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల ఫొటోలను అప్‌లోడ్ చేయండి

నాడు-నేడు కార్యక్రమం కింద పాఠశాలల అభివృద్ధికి చేసిన వారం రోజుల పనులను ప్రతి సోమవారం ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సంబంధిత మండల విద్యాధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లను జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్‌హాలు నుంచి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫొటోలు అప్‌లోడ్ చేసే కార్యక్రమంలో జిల్లాను ప్రథమ వరుసలో ఉంచే విధంగా కృషి చేయాలన్నారు. జిల్లాలో ఇంకా 2961 మంది బడి బయట పిల్లలు ఉన్నారని వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి ఆయా పిల్లలను సంబంధిత పాఠశాలలలో చేర్పించే విధంగా ప్రత్యేక దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. నాన్ రెసిడెన్షియల్ స్పెషల్ ట్రైనింగ్ సెంటర్ల నిర్వహణకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపే విధంగా అంచనాలను తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటప్పయ్య, ఏపీడబ్ల్యూఐడీసీ రమేష్, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, సమగ్ర శిక్ష అభియాన్ డీఈ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పుస్తక ప్రియులకు పండుగ

- దక్షిణాది రాష్ట్రాల్లో అతి పెద్ద మహోత్సవం
- మూడు దశాబ్దాలకు పైగా ఆదరణ
- అంకితభావమే విజయ రహస్యం అంటున్న నిర్వాహకులు
- నేటి నుంచి పుస్తక మహోత్సవం


పుస్తక మహోత్సవ ప్రాంగణంలో ఏర్పాటు చేసి స్టాల్స్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ బుక్ ఫెస్టివల్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు పుస్తక మహోత్సవం విజయవాడ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణ వేదికగా జరుగనుంది. రాష్ట్రానికి చెందిన ప్రచురణ కర్తలే కాకుండా దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ ప్రచురణ సంస్థలు, ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు, బహుళ జాతి సంస్థలు సైతం ఈ పుస్తక మహోత్సవంలో తమ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నాయి. సాహిత్య అకాడమీ, నేషనల్ బుక్ ట్రస్ట్ తదితర ప్రభుత్వ సంస్థలు సైతం బుక్ ఫెస్టివల్‌కు అండదండలందించి పుస్తక పఠనాన్ని పెంపొందిస్తున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో అత్యంత పెద్దదిగా పేరుగాంచిన విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ 32 సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుని 33వ సంవత్సరంలోకి అడుగు పెట్టనుంది.

220 స్టాల్స్ ఏర్పాటు

1989వ సంవత్సరంలో నగరానికి చెందిన ప్రచురణ కర్తలు నేషనల్ బుక్ ట్రస్ట్ సహకారంతో తొలి సారిగా 89 స్టాల్స్‌తో ప్రారంభించిన పుస్తక మహోత్సవం 370 దుకాణాలను సైతం నిర్వహించింది. అయితే పార్కింగ్‌కు, ఇతర సదుపాయాలకు స్థలాన్ని కేటాయించడంతో గతంలో దానిని 300 స్టాల్స్‌కు మాత్రమే పరిమితం చేశారు. ఈ ఏడాది బుక్ ఫెస్టివల్ ప్రాంగణాన్ని మార్పు చేయడంతో 220 స్టాల్స్‌కు పరిమితమైంది.

సాంకేతికత ఉన్నా.. తగ్గని ఆదరణ

విజయవాడ పుస్తక మహోత్సవం కోసం సాహితీ ప్రియులు ఎదురు చూస్తున్నారు. ప్రతి ఏడాది జనవరి 1వ తేదీన ప్రారంభమయ్యే మహోత్సవం కొన్ని కారణాల రీత్యా ఫిబ్రవరి 9వ తేదీన ప్రారంభమవుతోంది. కృష్ణాజిల్లానే కాకుండా యావత్ కోస్తా జిల్లాలకు చెందిన విద్యార్థులు, సాహితీ వేత్తలు, సాహితీప్రియులు, విద్యాసంస్థలు పుస్తక మహోత్సవానికి విచ్చేసి కొనుగోలు చేస్తుంటారు. ఇంటర్నెట్ వంటి ఆధునిక సాంకేతిక ప్రచార మాధ్యమాలు అభివృద్ధి చెందుతున్నా పుస్తక పఠనానికి ఏమాత్రం ఆదరణ తగ్గలేదన్న విషయం గత పుస్తక మహోత్సవాల విజయవంతం రుజువు చేశాయి.

ఆలోచింపజేసే చర్చా వేదికలు..

గడిచిన కొన్నేళ్లుగా పుస్తక మహోత్సవంలో కొత్త అంకానికి తెర తీశారు. గతంలో పుస్తకాలు, సాహితీ కార్యక్రమాలు దాని అనుబంధ అంశాలకే బుక్ ఫెస్టివల్ సొసైటీ పరిమితమైంది. కానీ ఇటీవల ప్రత్యేక అంశాలపై చర్చా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆలోచింపజేస్తున్నారు. గతంలో నోట్ల రద్దు గురించి దువ్వూరి సుబ్బారావు, నదుల అనుసంధానం గురించి రాజేంద్రసింగ్ వంటి ప్రముఖులతో ప్రత్యేక చర్చా కార్యక్రమాలను నిర్వహించారు. అదే రీతిలో ప్రతి ఏడాది కొన్ని ప్రత్యేక అంశాలపై సదస్సులను ఏర్పాటు చేసి చక్కని చర్చను కొనసాగిస్తున్నారు.

కోల్‌కతా బుక్ ఫెస్టివల్‌ను చూసి...



కోల్‌కతా బుక్ ఫెస్టివల్‌ను, ఇతర రాష్ట్ర రాజధానుల్లో పుస్తక మహోత్సవాలను చూసి విజయవాడలో కూడా నిర్వహించాలని భావించాం. తొలి రోజుల్లో అనేక వ్యయప్రయాసల కోర్చి నేషనల్ బుక్ ట్రస్ట్ సహకారంతో తొలిసారిగా విజయవాడలో పుస్తక మహోత్సవాన్ని నిర్వహించాం. ఆ తరువాత సభ్యులందరి కృషితో సొసైటీ అన్ని అవాంతరాలను ఎదుర్కొంటూ 32 సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకోవడం ఆనందంగా ఉంది.

– బెల్లపు బాబ్జీ, బుక్ ఫెస్టివల్ సొసైటీ గౌరవాధ్యక్షుడు

విజయవంతంగా పుస్తక మహోత్సవం



నూతన సాంకేతిక విప్లవం నేపథ్యంలో పుస్తక పఠనానికి ఇబ్బందులెదురవుతున్నాయి అనుకుంటున్న ప్రస్తుత అసాధారణ పరిస్థితుల్లోనూ విజయవాడ పుస్తక మహోత్సవం విజయవంతంగా జరుగుతోంది. ముఖ్యంగా కోల్‌కతా వంటి మహా నగరాల్లో మాత్రమే ఈ విధమైన పుస్తక మహోత్సవం విజయవంతమవుతుందని పుస్తక ప్రచురణ సంస్థలు భావించేవి. కానీ విజయవాడ వంటి నగరంలోనూ విజయవంతం చేసి చూపించిన ఘనత ఈ ప్రాంత ప్రజానీకానికి దక్కుతుంది.

– డి.విజయకుమార్, ఎమెస్కో అధినేత

మీడియా సహకారం అద్భుతం



విజయవాడ పుస్తక మహోత్సవం విజయవంతంలో మీడియా ప్రధాన భూమికను పోషిస్తోంది. విజయవాడ పుస్తక మహోత్సవంలో నగరంలోని మీడియా సంస్థలన్నీ భాగస్వాములుగా మారి తమ సొంత కార్యక్రమంగా కలిసి ప్రయాణం చేస్తాయి. పుస్తక మహోత్సవ ప్రాంగణం పుస్తక ప్రియులతో కళకళలాడటం చూస్తుంటే అదొక అద్భుతమైన అనుభూతికి అందరం లోనవుతుంటాం.

– కె.లక్ష్మయ్య, బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యదర్శి

అందరి అండతోనే



నగరంలోని పుస్తక ప్రచురణకర్తలందరి సహకారంతోనే ఇన్నేళ్లుగా పుస్తక మహోత్సవాన్ని కొనసాగిస్తున్నాము. పుస్తక ప్రచురణకర్తలే కాకుండా సాహితీవేత్తలు, ఇతర కళా సంస్థల నిర్వాహకులు, సాహితీ అభిమానులు, నగర ప్రముఖులు ఇలా ప్రతి ఒక్కరూ పుస్తక మహోత్సవం విజయవంతానికి అండగా నిలిచారు. ప్రభుత్వ శాఖలు సైతం ఈ ఏడాది అపూర్వమైన సహకారాన్ని అందిస్తున్నాయి.

– మనోహరనాయుడు, బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షుడు

మద్యం తాగేందుకు వచ్చి.. మురుగు గుంటలో శవమై..

- అదృశ్యమైన యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి
- మఠంపల్లిలో వెలుగుచూసిన ఘటన
- మృతుడు పల్నాడు జిల్లా వాసి

మఠంపల్లి: అదృశ్యమైన యువకుడు మురుగు గుంటలో శవమై తేలాడు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలో బుధవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం సారంగపల్లి గ్రామానికి చెందిన గల్లా నతానియేల్ (26) స్నేహితులతో కలిసి తరచూ మద్యం సేవించేందుకు మఠంపల్లి మండల కేంద్రానికి వచ్చి పోతుంటాడు. ఈ నేపథ్యంలోనే నతానియేల్ ఈ నెల 6వ తేదీన ఇద్దరు స్నేహితులతో కలిసి మఠంపల్లిలోని ప్రధాన రహదారి పక్కన గల పంజాబీ దాబాకు వచ్చారు. అక్కడ మద్యం సేవించిన తర్వాత ఇద్దరు స్నేహితులు స్వస్థలానికి వెళ్లిపోగా నతానియేల్ ఇంటికి వెళ్లలేదు. దీంతో మరుసటి రోజు (7వ తేదీన) అతడి తండ్రి ప్రసాదరావు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదైంది. బుధవారం ఉదయం స్థానికులు మురుగు గుంటలో తేలిన మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం వెలుగులోకి వచ్చింది. సమాచారం మేరకు ప్రసాదరావు, ఇతర కుటుంబ సభ్యులు వచ్చి మృతుడు నతానియేల్ అని గుర్తుపట్టారు. హత్య చేసి మురుగు గుంటలో పడవేశారని, నిందితులను కఠినంగా శిక్షించాలని కొద్ది సేపు పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. పోలీసులు మృతదేహాన్ని వెలికి తీయించి పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. మఠంపల్లికి నతానియేల్‌తోపాటు వచ్చిన ఇద్దరు స్నేహితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ప్రసాదరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మఠంపల్లి ఎస్ఐ ఇరుగు రవి తెలిపారు.

గంజాయి అక్రమ రవాణా కట్టడి


ప్రయాణికుల వస్తువులను తనిఖీ చేస్తున్న జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు

లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): గుంటూరు రైల్వేస్టేషన్‌లో అక్రమంగా గంజాయి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు రైల్వే ఎస్పీ విశాల్‌గున్ని ఆదేశాల మేరకు గుంటూరు రైల్వేస్టేషన్‌లో పలు రైళ్లలో ప్రయాణికుల సామాగ్రి, పార్సిల్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించినట్లు జీఆర్పీ సీఐ డి.వెంకటేశ్వర్లు తెలిపారు. గుంటూరు రైల్వేస్టేషన్‌లో బుధవారం రైల్వే ఎస్పీ విశాల్‌గున్ని ఆదేశాల మేరకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గుంటూరు రైల్వే స్టేషన్‌కు గుర్తుతెలియని వ్యక్తులు గంజాయి రవాణా చేస్తున్నట్లు ఎస్పీ ఆదేశాల మేరకు జీఆర్పీ, ఆర్పీఎఫ్, సీఐబీ, డాగ్‌స్క్వాడ్ సంయుక్తంగా తనిఖీలు చేయడం జరిగిందన్నారు. ప్రయాణికుల వస్తువు సామగ్రి, పార్సిల్ కార్యాలయాన్ని, జన్మభూమి, భువనేశ్వర్ వంటి పలు రైళ్లలో క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందన్నారు. రైళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు భోగీల్లో గుర్తుతెలియని వ్యక్తులు సామగ్రి, పార్సిల్ కార్యాలయాల్లో సామగ్రి ఉంచి అనుమానాస్పదంగా ఉంటే తక్షణమే తమకు సమాచారం తెలియజేయాలన్నారు. అనుమానాస్పదంగా ఉన్నట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. రైళ్లల్లో ప్రయాణించే ప్రయాణికులు తోటి ప్రయాణికుల నుంచి తినుబండారాలు, పానీయాలు సేవించడం ప్రమాదకరమన్నారు. గుంటూరు రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన తనిఖీల్లో ఎలాంటి అక్రమ గంజాయి రవాణా కనబడలేదని తెలిపారు. అనంతరం ప్రయాణికులకు గుర్తుతెలియని వ్యక్తులను గుర్తించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను పోలీసులకు తెలియజేయాల్సిన వాటిపై అవగాహన కల్పించారు.

బస్సును ఢీ కొన్న టిప్పర్


అంబులెన్స్ వాహనంలో బాధితులను గుంటూరు తరలిస్తున్న దృశ్యం

పెదకాకాని: ప్రయాణికులను ఎక్కించుకునేందుకు ఆగిన ఆర్టీసీ బస్సును టిప్పర్ లారీ ఢీ కొన్న సంఘటన బుధవారం వెంకటకృష్ణాపురం గ్రామ శివార్లలో చోటు చేసుకుంది. స్థానికులు, అంబులెన్స్ సిబ్బంది తెలిపిన కథనం ప్రకారం తెనాలి వయా నందివెలుగు మీదుగా ప్రయాణికులతో పల్లెవెలుగు బస్సు బయలు దేరింది. ఈ బస్సు పెదకాకాని మండలం వెంకటకృష్ణాపురం గ్రామ శివార్లకు చేరుకునే సరికి ప్రయాణికులు బస్సు ఆపారు. అదే సమయంలో వెనుక నుండి ఇసుక లోడుతో వస్తున్న డంపర్ టిప్పర్ లారీ వేగంగా వచ్చి ఢీ కొంది. ఈ ఘటనలో బస్సులో ఉన్న పది మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న రెండు 108 అంబులెన్స్ వాహనాల్లో బాధితులను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వారిలో ఆరుగురు ప్రథమ చికిత్స చేయించుకుని ఇళ్లకు చేరారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో కె హనుమంతురావు, పి సాంబశివరావు, ఎస్ సుబ్బారావు, ఎన్ నాగేశ్వరిలు ఉన్నారు. తృటిలో ఘోర ప్రమాదం తప్పినట్లయింది. మంచు ఎక్కువగా ఉండటం, ఇసుక డంపర్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు.

పరిశ్రమల ఏర్పాటు ద్వారానే జిల్లా ప్రగతి

- జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్
- జిల్లా పరిశ్రమలు, ఎక్స్‌ఫర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశం



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

నరసరావుపేట: జిల్లాలో పెద్ద సంఖ్యలో పరిశ్రమలను ఏర్పాటు చేసి జిల్లా ప్రగతికి చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్‌కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎక్స్‌ఫర్ట్ ప్రమోషన్ కమిటీ సమీక్ష సమావేశం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో జిల్లాలో భారీ పరిశ్రమలు, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు వివరాలు, వాటి పని తీరు వంటి అంశాలను ప్రస్తావిస్తూ నూతనంగా పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే వారికి సింగిల్ డెస్క్ పోర్టల్ విధానాన్ని తెలిపారు. జిల్లాలోని ఇంతకు మునుపు జరిగిన సమీక్ష సమావేశం నుంచి నేటి వరకు మొత్తం 158 దరఖాస్తులు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోగా 137 దరఖాస్తులు అనుమతులు పొందాయని, రెండు దరఖాస్తులు తిరస్కరించగా, 19 దరఖాస్తులు పలు శాఖలలో పరిశీలనలో ఉన్నాయని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పి.వెంకటేశ్వరరావు జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. వీరికి వీలైనంత త్వరగా అనుమతులు మంజూరు చేయాలని కోరామన్నారు. పరిశ్రమల ప్రోత్సాహక పథకం 2020-23, జగనన్న బడుగు వికాసం పథకం ద్వారా వచ్చిన 145 దరఖాస్తులకు రూ.7.34 కోట్ల సబ్సిడీ రాయితీలు మంజూరయ్యాయని, వీటిలో అత్యధికంగా 59 మంది ఎస్సీలు, 18 మంది ఎస్టీలకు మంజూరయ్యాయని తెలిపారు. పలు బ్యాంకుల వద్ద ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని లీడ్ బ్యాంకుల పర్యవేక్షణ అధికారిని ఆదేశించారు. జిల్లాలో ఎంపార్క్‌ల ఏర్పాటుకు 20 ఎకరాలు, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లకు ఐదెకరాలు అనుకూలమైన ప్రభుత్వ భూమిని కేటాయిస్తామన్నారు. ఏపీఐఐసీ ప్లాట్ అలాట్‌మెంట్ కమిటీ సూచించిన విధంగా ఎంఎస్ఎంఇ పార్క్ పిడుగురాళ్లలో ఒక ప్లాట్‌ను ఎంపిక చేసి దరఖాస్తుదారునకు కేటాయించామన్నారు. స్టాండ్ అప్ ఇండియా పథకం ద్వారా వచ్చిన 37 దరఖాస్తుల మంజూరు చేసినట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చినెలలో 3, 4 తేదీలలో విశాఖపట్నంలో జరిగే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు పల్నాడు జిల్లా నుంచి వీలైనంత ఎక్కువ మంది పరిశ్రమదారులు పాల్గొనే విధంగా కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఎల్‌డీఎం వెంకటేశ్వర్లు, జిల్లా రవాణా శాఖ అధికారి టి.పరంధామరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, ఏపీఐఐసీ, పరిశ్రమలు, కర్మాగారాలు పర్యవేక్షణ అధికారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూ కమతాల గణాంకాలు పురోగతి వేగవంతం చేయాలి

పల్నాడు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కొణకంచి ముక్తేశ్వరరావు


సదస్సులో మాట్లాడుతున్న జిల్లా అధికారి ముక్తేశ్వరరావు

శావల్యాపురం: భూకమతాలు గణాంకాల పురోగతి వేగవంతమయ్యేలా క్షేత్రస్థాయిలో వీఆర్వోలు బాధ్యత వహించాలని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కొణకంచి ముక్తేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో భూకమతాలు గణాంకాల పురోగతిపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ సమయంలో భూకమతాలు ఆధారంగా చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయ పరంగా ఎరువులు, విత్తనాలు రాయితీపై అందించటానికి ఈ గణాంకాలు దోహదపడతాయన్నారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు ప్రతి ఐదేళ్లకొకసారి గణాంకాలపై సర్వే చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, పురుష, స్త్రీలు విభాగాలుగా విభజించి గణాంకాలు జరుగుతాయన్నారు. భారతదేశ స్థాయిలో గణాంకాలు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రథమస్థానంలో ఉందన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 40457 ఖాతా నంబర్లు (భూకమతాలు) ఉండగా 15817 గణాంకాలు జరిగినట్లు చెప్పారు. ఆయనతోపాటు తహసీల్దార్ షేక్ జాన్‌సైదులు, మండల సహాయ గణాంక అధికారి జొన్నలగడ్డ శ్రీలక్ష్మి, ఆర్ఐ బాబు ఉన్నారు.

సాగర్ ప్రాజెక్టును సందర్శించిన కృష్ణానది యాజమాన్య బోర్డు కమిటీ


గ్యాలరీ వద్ద కృష్ణానది యాజమాన్య బోర్డు జలాశయాల పర్యవేక్షణ కమిటీ సభ్యులు

విజయపురిసౌత్: కృష్ణానది యాజమాన్య బోర్డు జలాశయాల పర్యవేక్షణ కమిటీ ప్రాజెక్టు ఇంజినీర్లతో కలిసి బుధవారం నాగార్జునసాగర్ ప్రాజెక్టును సందర్శించింది. మెయిన్ డ్యాం, గ్యాలరీలు, ఎర్త్‌డ్యాం ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం కుడి, ఎడమ కాల్వలను పరిశీలించడంతోపాటు అన్నిచోట్ల ఏర్పాటు చేసిన టెలిమెట్రీలను వాటి పనితీరును పరిశీలించారు. కృష్ణానదీ యాజమాన్య బోర్డు కమిటీ సభ్యుడు ఏ అజయ్‌కుమార్ గుప్త మాట్లాడుతూ తాను నూతనంగా కేఆర్ఎంబీలో సభ్యునిగా చేరడంతో అన్ని ప్రాజెక్టులను సందర్శిస్తున్నట్లు తెలిపారు. గుప్తాతోపాటు ఎస్ఈ అశోక్‌కుమార్, ఈఈలు, శివప్రసాద్, రాఘవేంద్రరావులు ఉండగా వీరివెంట సాగర్ డ్యాం ఈఈ మల్లికార్జునరావు, డీఈలు సుదర్శన్, శ్రీనివాస్, ఏఈ కృష్ణయ్య తదితరులు ఉన్నారు.